ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 20 జూన్ 2025



జస్ట్.. మాక్‌డ్రిల్

రాత్రివేళ.. చెట్టుపక్కన తుపాకులతో నక్కి పరిసరాలను గమనిస్తున్న భద్రతా సిబ్బందిని చూశారా? ఉగ్రవాదుల కదలికలను పసిగడుతూ ఇలా ముందుకు అడుగులేస్తున్నారు. ఇదంతా నిజం అనుకునేరు.. జస్ట్, మాక్ డ్రిల్ మాత్రమే. తిరుమలలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ కార్యక్రమం వివరాలు

- 6లో

రేపటి యోగాంధ్రకు విస్తృత ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి(విశ్వవిద్యాలయాలు/క్రీడలు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఎస్వీయూ తారకరామ స్టేడియంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఆ రోజు ఉదయం 5.45 నుంచీ 7.15 గంటల వరకూ యోగాసనాలు వేయనున్నారు. దీనికోసం యూనివర్సిటీ నుంచి మూడు వేల మంది, జిల్లా అధికార యంత్రాంగం మరో నాలుగు వేల మందిని సమీకరిస్తోంది. స్టేడియంను పరిశుభ్రంగా మార్చి, కార్పెట్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. యోగా నిపుణులు, సహాయకులను అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమాన్ని డ్రోన్లతో చిత్రీకరించనున్నారు. ఇక్కడి ఏర్పాట్లను గురువారం కమిషనరు మౌర్య పరిశీలించారు. యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. రెండు రోజుల పాటు వాకర్స్, ఇతర క్రీడాకారులను మైదానంలోకి అనుమతించడం లేదన్నారు. ఆమె వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, పర్యాటకశాఖ ఆర్డీ రమణప్రసాద్, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈ తులసికుమార్ తదితరులున్నారు.

ఎవరైనా అనుమానాస్పద స్థితిలో కనిపించారంటే చాలు.. పోలీసులు వారి వేలి ముద్రలు సేకరిస్తున్నారు. అలాగే, పాఫిలాన్, లైవ్ స్కానర్ల ద్వారా వేలి ముద్ర వేయగానే ఆ వ్యక్తులకు నేరచరిత్ర ఉంటే తెలిసిపోతుంది. ఇక, నేరఘటనల్లో వేలిముద్రలను ట్యాలీ చేసి నిందితులను పట్టుకునేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. ఇటీవల మధ్యప్రదేశ్ గ్యాంగ్‌ను తిరుపతి పోలీసులు ఇలాగే పట్టుకున్నారు. - తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి





ఫాపిలాన్

అనుమానముంటే వేలి ముద్ర వేయాల్సిందే



లైవ్ స్కానర్ ద్వారా వేలిముద్రల సేకరణ.. పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

- గత నెలలో 1650 మంది నుంచి సేకరించిన పోలీసులు
- నిందితుల గుర్తింపులో కీలకంగా పాఫిలాన్, లైవ్ స్కానర్లు

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేరగాళ్లు పోలీసులను ఏమార్చేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మరోవైపు పోలీసులూ వారిని పట్టుకునేందుకు.. భవిష్యత్తులో దొంగతనాలకు పాల్పడినా గుర్తించేలా సాంకేతికతను అంది పుచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న పాపిలాన్, లైవ్ స్కానర్ల ద్వారా వేలి ముద్రలు, అరచేతి ముద్రలు సేకరిస్తున్నారు. ఈ వివరాలు నేరగాళ్లను గుర్తించడంలో పోలీసులకు సహాయ పడుతున్నాయి. గతంలో వేలి ముద్రలు సేకరించే పనులు చాలా మందకొడిగా సాగేవి. ఇటీవల నేరాలు పెరగడం, గంజాయి, బహిరంగంగా మద్యం తాగడం, మహిళలు, వేధింపులు, చిన్నారులపై అఘాయిత్యాలు, ఇంటి దొంగతనాలు, దోపిడీలు, ద్విచక్ర వాహనాల చోరీ, బస్టాండు, రైల్వే స్టేషన్‌లో చైన్ స్నాచింగ్‌లు, పిక్‌ప్యాకెట్లు పెరిగాయి. ఫాపిలాన్‌తో పాటు లైవ్ స్కానర్లను వినియోగించి ఈ ఘటనల్లో నిందితులను గుర్తించే పనులు చేపట్టారు. అదే సమయంలో అనుమానితుల వేలి ముద్రలు సేకరించే పనులూ సాగుతున్నాయి. గత నెలలో దాదాపు 1650 మంది వేలి ముద్రలు సేకరించారు. ఇలా వేలి ముద్రల సేకరణలో రాష్ట్రంలోనే తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఎస్పీ హర్షవర్ధన్‌కు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అభినందనలు తెలుపుతూ కీపిటప్ అని ప్రశంసించారు.

- ఇటీవల తిరుచానూరు, తిరుపతి ఈస్ట్ పరిధిలో జరిగిన మారుతీ షోరూముల్లో దోపిడీ ఘటనల్లో వేలి ముద్రల ఆధారంగానే మధ్యప్రదేశ్ గ్యాంగ్‌ను పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు.
- తిరుపతిలోని విష్ణునివాసంలో రోజూ 20 నుంచి 30 మొబైల్ ఫోన్లు, బంగారు నగలు, విలువైన వస్తువులు చోరీకి గురయ్యేవి. బాధితులు ఫిర్యాదు ఇవ్వడం తప్ప న్యాయం జరిగిన ఘటనలు చాలా తక్కువ. ఈ క్రమంలో విష్ణునివాసంలో లైవ్ స్కానర్ ఏర్పాటు చేసి అనుమానితులు, పాత నేరస్థుల వేలి ముద్రలు సేకరించే పనులు చేపట్టారు. ఇలా విష్ణునివాసం, శ్రీనివాసం వద్ద వారం కిందట 15 మందిని ఒకసారి, ఐదుగురిని మరోసారి గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 20 సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. దీంతో అక్కడ దొంగతనాలు తగ్గు ముఖం పట్టాయి.

జిల్లాలో 13,187 సీసీ కెమెరాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా బ్లాక్ స్పాట్స్, ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, మారుమూల పల్లెలు, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నాలుగు నెలలుగా దాదాపు 13,187 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా గరుడ పైఓవర్‌పై ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరిగి పోవడం, ఆకతాయిల ఆగడాలు ఎక్కువ కావడం, అర్ధరాత్రి పూట మత్తు పదార్థాల వినియోగం పెరగడంతో ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. త్వరలో ఇంకా కీలకమైన ప్రదేశాల్లో అమర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రైల్వే స్టేషన్, బస్టాండులోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో భిక్షగాళ్ల సందడి, నేరస్థుల కదలికలు తగ్గుముఖం పట్టాయి. విష్ణునివాసంలో బంగారం ఉండే బ్యాగు తీసుకెళ్తుంటే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకున్నారు.



బస్సుల్లో ప్రయాణిస్తున్న అధికారులు

'కొండ'పై భక్తులకు మరిన్ని ఉచిత బస్సులు

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులను ట్యాక్సీ దోపిడీ నుంచి రక్షించేలా మరిన్ని ఉచిత బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. తిరుమలలో ప్రస్తుతం 10 శ్రీవారి ధర్మరథాలు(ఉచిత బస్సులు) అందుబాటులో ఉన్నాయి. ఇవి తిరుమలలోనే ఉంటూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరవేస్తుంటాయి. ఇటీవల తిరుమలలోని ట్యాక్సీలు భక్తులను నుంచి అధిక మొత్తం ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులున్న క్రమంలో టీటీడీ ఓ నూతన ఆలోచన చేసింది. తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే ఆర్టీసీ బస్సులను కూడా ఫ్రీ సర్వీసుకు వినియోగించాలని నిర్ణయించింది. దీనికి ఆర్టీసీ అధికారులు అంగీకారం తెలపడంతో తొలిదశలో గురువారం 80 ఆర్టీసీ బస్సులను ఉచిత రవాణాకు అందుబాటులోకి తీసుకొచ్చారు. భక్తులకు ట్యాక్సీల ఛార్జీల భారం తగ్గించడంతో పాటు తిరుమలలో పర్యావరణ పరిరక్షణ, వాహన శబ్ధ కాలుష్య నివారణకు ఈ విధానం ఉపయోగంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఆర్టీసీలో ఉచిత ట్రిప్పులను గురువారం ప్రారంభించి.. ఆ బస్సులో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్, టీటీడీ రవాణా జీఎం శేషారెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటరావు, డిప్యూటీ సీఎంఈ బాలాజీ, డిపో మేనేజర్ శ్రీహరి తదితరులు కొంతదూరం ప్రయాణించారు.

ఏయే ప్రాంతాల్లో తిరుగుతాయంటే..

తిరుపతి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు తొలుత తిరుమలలోని బాలాజీ బస్టాండ్‌కు చేరుకుంటాయి. అక్కడ ప్రయాణికులు దిగాక.. అదే బస్సు శ్రీవారి ధర్మరథాలు తిరిగే రూట్‌లోకి ప్రవేశిస్తుంది. శంఖుమిట్ట(ఎస్ఎంసీ), వైకుంఠం 1, ఎస్వీ గెస్ట్‌హౌస్, కృష్ణతేజ సర్కిల్, వైకుంఠం 2, ఎస్వీ మ్యూజియం, మఠాలు, వరాహస్వామి విశ్రాంతి గృహాలు, నందకం, రాంభగీచ, లేపాక్షి సర్కిల్, సీఆర్వో కార్యాలయం మీదుగా తిరిగి జీఎన్సీ టోల్‌గేట్‌కు చేరుకుంటుంది. తిరుపతి నుంచి వచ్చే భక్తులు ఈ ప్రాంతాల్లో ఎక్కడైనా దిగచ్చు. ఈ ప్రాంతాల్లో ఎక్కే ప్రయాణికులు జీఎన్సీ టోల్‌గేట్ వరకు తమకు కావాల్సిన ప్రాంతాల్లో దిగచ్చు. జీఎన్సీ తర్వాత తిరుపతి వెళ్లే భక్తులు మాత్రమే టికెట్ కొనాలి. తిరుపతికి వెళ్లే భక్తులకు వరాహస్వామి విశ్రాంతి గృహాల వద్ద టికెట్లు విక్రయించే కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. అవసరానికి అనుగుణంగా ఈ బస్సుల సంఖ్యను 150 వరకు పెంచాలని అధికారులు భావిస్తున్నారు.

కూటమిలో కోవర్టులు!

- కౌన్సిల్ సమావేశంలో బట్టబయలు
- ఆలోచనలో పడ్డ నేతలు

తిరుపతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎన్డీఏ కూటమిలో కోవర్టుల భయం పట్టుకుంది. నగరపాలక సంస్థకు చెందిన ఓ స్థలాన్ని విక్రయించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై జరిగిన కౌన్సిల్ సమావేశంలో కొందరు కార్పొరేటర్ల వ్యవహారశైలి తీవ్ర చర్చకు దారితీసింది. వైసీపీ కండువా తీసి కూటమి కండువాలు కప్పుకున్నారు గానీ గత పార్టీ భావజాలం మాత్రం అలాగే ఉందనే వాదన కౌన్సిల్ సమావేశంలో స్పష్టమైంది. అధికార పార్టీతో ఉంటే అన్ని పనులు చక్కబెట్టుకోవచ్చనే స్వార్థంతోనే కండువాలు వేసుకుని కొందరు, వేసుకోకుండా మరికొందరు తిరుగుతున్నారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. కార్పొరేషన్ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు కూటమి మద్దతు కార్పొరేటర్లు ప్రతిపక్ష పార్టీ నిర్ణయానికి అనుకూలంగా కనిపించి కూటమి నేతలకు షాక్ ఇచ్చారు. సాక్షాత్తు కౌన్సిల్ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఎదుటే కూటమి నిర్ణయానికి అడ్డుతగలడం ఆశ్చర్యానికి గురిచేసింది. సమావేశం అనంతరం ఎమ్మెల్యే కూడా కార్పొరేటర్ల వ్యవహారశైలిపై నాయకుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. కౌన్సిల్ సమావేశానికి ముందురోజే తిరుపతిని అమ్మేస్తున్నారంటూ కూటమి ప్రభుత్వ పెద్దలను తిట్టిపోస్తూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే డిప్యూటీ మేయర్లు, కూటమిలోని మహిళా కార్పొరేటర్లు మినహా గట్టిగా గొంతెత్తి ఖండించాల్సిన సీనియర్ కార్పొరేటర్లు మాత్రం సెటైర్లు వేసుకోవడం ఎమ్మెల్యేని నివ్వెరపరిచింది. అయినప్పటికీ కౌన్సిల్ సమావేశం అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడే సమయంలోనూ వైసీపీని ఖండించని కార్పొరేటర్లనే పక్కన పెట్టుకున్నారు. కూటమిలో విలువ, స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ కొందరు ఇంకా వైసీపీ బంధం నుంచి బయటపడకపోవడంలేదన్న అనుమానాలు బలపడుతున్నాయి. వైసీపీ నేతల కనుసన్నల్లోనే సదరు కార్పొరేటర్లు పనిచేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కూటమిలో కోవర్టులను పెట్టుకుని రాజకీయాలు ఎలా చేయాలంటూ నాయకులు మదనపడుతున్నారు. ఇకనైనా ఇలాటివారిపట్ల అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నారు.

వారి సభ్యత్వాన్ని రద్దు చేయండి

మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన చాణక్య హోటల్ విక్రయానికి అనుకూలంగా ఓటేసిన వైసీపీ కార్పొరేటర్ల సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆపార్టీకి చెందిన మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు గురువారం కమిషనర్ మౌర్యకు వినతి పత్రం అందజేశారు. కౌన్సిల్ సమావేశానికి ముందు తమ పార్టీ కార్పొరేటర్లకు విప్ జారీ చేసినా కొందరు ధిక్కరించి కూటమికి అనుకూలంగా మాట్లాడారన్నారు. కమిషనర్‌ను కలిసినవారిలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఉమా అజయ, ఆరణి సంధ్య, అమరనాథ్ రెడ్డి, అనిల్ తదితరులు ఉన్నారు.

తోతాపురి తక్కువకు కొంటే కఠిన చర్యలు

|| ఇద్దరు ర్యాంపు యజమానులపై కేసు నమోదు చేయించిన కలెక్టర్ ||

పాకాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కాయల రైతులకు తక్కువ ధర చెల్లించే ర్యాంపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. పాకాల మండలం దామలచెరువు మ్యాంగోనగర్ పరిసరాల్లోని ర్యాంపులను గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ర్యాంపు నిర్వాహకులు కిలో రూ.3 చొప్పున కొంటున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రైతుల నుంచి ఫిర్యాదు తీసుకొని ర్యాంపు నిర్వాహకులపై కేసు నమోదు చేయాలని సీఐ సుదర్శన ప్రసాద్‌ను ఆదేశించారు. కలెక్టర్ స్వయంగా ఓ రైతు నుంచి ఫిర్యాదు తీసుకొని ర్యాంపు వద్ద కొనుగోలు చేస్తున్న షోలాపూర్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ర్యాంపుల వద్ద కనీసం కిలో రూ.4కు తక్కువ కాకుండా కొనుగోలు చేయకుంటే ఆ ర్యాంపులను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ర్యాంపు వద్ద వీఆర్వో, కానిస్టేబుళ్లు ఉంటారన్నారు. జీఎస్‌కేసీఎంఎన్ ర్యాంపు నిర్వాహకుడు ట్రేడర్లతో కలిసి సిండికేట్ అయి టన్ను తోతాపురి కాయలకు 25 కిలోల చొప్పున సూట్ రైతుల నుంచి తీసుకుంటున్నట్లు గుర్తించారు. అదనంగా సూట్ తీసుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మామిడికాయలు తోలిన రైతు భాస్కర్‌రెడ్డితో కలెక్టర్ ఫోనులో మాట్లాడగా, కిలో రూ.3కు జీఎస్‌కేసీఎంఎన్ ర్యాంప్ యజమాని కొన్నారని చెప్పారు. దీంతో ఆ ర్యాంప్ యజమానిపై కలెక్టర్ కేసు నమోదు చేయించారు. తోతాపురి రైతులకు ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబరు 0877 2236007కు ఫోనుచేసి చెప్పాలన్నారు. ఉప్పరపల్లె పంచాయతీ రామిరెడ్డిగారిఇండ్లు సమీపంలోని సుప్రీం క్వాలిటీ ఫుడ్స్ గుజ్జు పరిశ్రమను కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా వచ్చిన రైతులకు టోకెన్లు జారీ చేసి కొనాలని సూచించారు. చివరి మామిడికాయ వరకు కొనేలా చర్యలు చేపడతామని, ప్రతి రైతుకు కిలోకు రూ.4 చొప్పున రాయితీ వారి ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, తహసీల్దారు సంతోష్‌సాయి, ఉద్యానశాఖ అధికారిణి శైలజ తదితరులు పాల్గొన్నారు.



మ్యాంగోనగర్ సమీపంలో ర్యాంపుల యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

22న జిల్లాస్థాయి అండర్-15 చదరంగం పోటీలు

తిరుపతి(క్రీడలు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని యూత్‌హాస్టల్ వేదికగా ఈనెల 22న జిల్లాస్థాయి అండర్-15 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్, ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాససూరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో గెలుపొందిన బాలబాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు 01-01-2010లో జన్మించివుండాలి. మరిన్ని వివరాల కోసం 98852 38474, 89773 71753 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహిళల సమస్యలు, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక హెల్ప్‌లైన్

- పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తాం
- జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ వెల్లడి

- 6లో -



మూడు కిలోల గంజాయి స్వాధీనం

రేణిగుంట, జూన్ 19, (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్ జీపు స్టాండులో గురువారం గంజాయి విక్రయిస్తుండగా అర్బన్ సీఐ జయచంద్ర సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. వీరికి అందిన సమాచారంతో జరిపిన దాడుల్లో మూడు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకకు చెందిన భరత్, దినేష్, నితీష్, ఒడిసాకు చెందిన జోగేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు పోలీసులు తెలిపారు.

సమాజ హితంగా పనిచేద్దాం


కేకేవీపురం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సమాజ హితమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కట్టకిందవెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు మన సంస్కృతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పది మందికి మంచిచేస్తే అది మనల్ని కాపాడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు కాయం హరినాథ్‌రెడ్డి, సభ్యులు జయరామ్, మునెయ్య, చండేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

రామచంద్రాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ తిరుపతి జిల్లా కార్యదర్శి డాక్టర్ పెనుబాల చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రాయలచెరువుకట్ట కింద ఉన్న రాయల మండపంలో బీజేపీ మండలాధ్యక్షుడు నరసాని జనార్దన్‌నాయుడు అధ్యక్షతన వికసిత్ భారత్, అమృతకాలం, సేవా సుపరిపాలన, పేదల సంక్షేమానికి 11 సంవత్సరాలు అనే కార్యక్రమం నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం వికసిత్ భారత్ 2047 సాధన కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు జనార్దన్‌నాయుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రభాకర్‌నాయుడు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి


గుంతను తప్పించడానికి పెట్టిన బండరాయి

చంద్రగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరి, శ్రీనివాసమంగాపురం మార్గంలో నూతనంగా నిర్మించిన ఫ్లైవోవర్ వద్ద కొన్ని నెలలుగా రోడ్డు మరమ్మతులకు గురైంది. గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఒకచోట పెద్ద గొయ్యి ఏర్పడడంతో వాహనదారులు దాన్ని గమనించడానికి బండరాయి పెట్టారు. రాత్రిపూట దాన్ని గమనించకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వర్షం కురిసినప్పుడు ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు కొన్ని నెలలుగా ఇదే దారిలో తిరుగుతున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించండి


సమావేశంలో మాట్లాడుతున్న దేవదాసు

చంద్రగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెస్పీ సీనియర్ నేత, జిల్లా ఇన్‌చార్జ్ వర్ల దేవదాసు మాదిగ కోరారు. చంద్రగిరి మండలంలోని నారావారిపల్లె, చిన్నరామాపురం గ్రామాల్లో ఆయన గురువారం ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెలను పరిశీలించారు. వాటిని సుందరీకరించాలని నాయకులకు సూచించారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ కమిటీలను నియమించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు వావిళ్ల శివయ్య, జిల్లా అధ్యక్షుడు ధనంజయలు, ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు మునిరత్నం, ఎమ్మార్పీఎస్ నాయకులు గోపిమాదిగ పాల్గొన్నారు.

ఊపందుకున్న జాతీయ రహదారి విస్తరణ పనులు


తుమ్మలగుంట సమీపంలో చేపడుతున్న పనులు

తిరుపతిరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల పరిధిలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులు జోరందుకున్నాయి. సి.మల్లవరం నుంచి తనపల్లె సర్కిల్ సమీపం వరకు రహదారికి రెండు వైపులా ఎన్‌హెచ్ ఆధ్వర్యంలో గుర్తించిన హద్దుల వరకు చదును చేసి నిర్మాణ పనులు చేపడుతున్నారు. గాంధీనగర్, పేరూరు, తుమ్మలగుంట పరిధిలో రహదారి విస్తరణలో భాగంగా వైట్‌మిక్స్‌తో చదును చేసి దానిపై తారురోడ్డు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రహదారికి మధ్యలో సప్లై చానల్స్ వెళ్లే మార్గంలో అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను చేపడుతున్నారు. మరికొన్ని చోట్ల రహదారికి ఇరువైపులా మట్టితోలి యంత్రాలతో చదును చేస్తున్నారు.

మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు


మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

భాకరాపేట, జూన్ 19(ఆంధ్ర జ్యోతి): మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్వీకార్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రెడ్డికుమారి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం దీన్‌దార్లపల్లెలో స్వీకార్ ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి టాటా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో 60 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటయ్య బాబు, మెహతాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రగిరిలో రెడ్‌బుక్ రాజ్యాంగం

● చెవిరెడ్డి అరెస్టుకు వ్యతిరేకంగా నిరసనలో విమర్శ

చంద్రగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి అన్నారు. లిక్కర్ స్కాంలో చెవిరెడ్డిని అరెస్ట్ చేయడంతో గురువారం సాయంత్రం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తన భర్త ఎటువంటి తప్పు చేయకున్నా జైల్లో పెట్టడం బాధాకరమన్నారు. కూటమి అధికారంలోకి రాగానే తమ కుటుంబాన్ని టార్గెట్ చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు ఉద్యాన శాఖాధికారిగా ఆషియ



భాకరాపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండల ఉద్యాన శాఖాధికారిగా ఆషియ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న శివకుమారి తిరుపతికి బదిలీ కాగా రైల్వేకోడూరులో ఉద్యాన శాఖాధికారిగా పనిచేస్తున్న ఆషియ చిన్నగొట్టిగల్లుకు బదిలీ అయ్యారు.

పక్వానికి వచ్చిన మామిడినే కోయండి

పక్వానికి వచ్చిన తోతాపురి కాయలనే కోత కోయాలని చిన్నగొట్టిగల్లు ఉద్యాన శాఖాధికారి ఆషియ తెలిపారు. చిన్నగొట్టిగల్లులో గురువారం ఆమె మాట్లాడుతూ తొందరపడి అన్నీ ఒకేసారి కోతలు చేయడం ద్వారా పల్ప్ ఫ్యాక్టరీల ర్యాంపుల దగ్గర రద్దీ పెరిగి రైతులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తుందన్నారు. తోటలో చివరి కాయ వరకు ప్రభుత్వం అందించే మద్దతు ధర వర్తిస్తుందన్నారు. ర్యాంపుల వద్ద రెండు, మూడు రోజులు వేచి ఉండడం వల్ల కాయల నాణ్యత తగ్గిపోతుందన్న విషయాన్ని రైతులు గమనించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

నేడు వకుళామాత ఆలయ వార్షికోత్సవం

తిరుపతిరూరల్, మే19(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరుబండపై వెలసిన వకుళామాత అమ్మవారి ఆలయ మూడవ వార్షికోత్సవం శుక్రవారం జరగనుంది. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి పేర్కొన్నారు. అమ్మవారి ఆలయంలో ఉదయం 5.30-6గంటల వరకు సుప్రభాతం, 6-8గంటల మధ్య నిత్యకైంకర్యాలు, మూలవర్లకు అభిషేకం, అలంకారం, నివేదన, ఉదయం 9-11గంటల మధ్య విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, మహాశాంతిహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారని ప్రకటించారు. ఉదయం 11-12గంటల మధ్య ఉత్సవమూర్తులకు అష్టోత్తర శతకలశాభిషేకం చేపడుతారని పేర్కొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవోలు

పాకాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీలలో ఇతర మండలాలకు వెళ్తున్న ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోలు బాట్జీ, లింగయ్య 20 మంది ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుమార్ రెడ్డి, సుమలత, వెంకటనారాయణ చౌదరి, సీఆర్పీలు పాల్గొన్నారు.

మోడల్‌గా పేరూరు చెత్తసంపద తయారీ కేంద్రం

పనులను పరిశీలించిన డీఎల్‌పీవో సురేష్‌నాయుడు



ఎస్‌డబ్ల్యూపీసీలో పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సురేష్‌నాయుడు, పక్కనే కార్యదర్శి రెడ్డి జ్యోతీశ్వరప్రసాద్, డీఆర్పీ షణ్ముగరామ్ - మట్టిని తోలి ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

తిరుపతిరూరల్, మే19(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సృష్టించడం ద్వారా గ్రామాభివృద్ధికి బాట వేయాలనే సంకల్పంతో చెత్తసంపద తయారీ కేంద్రాల నిర్వహణపై కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రత్యేక దృష్టి సారించారు. ఆ మేరకు జిల్లా ఉన్నతాధికారులు రూరల్ మండల పరిధిలోని చెత్తసంపద తయారీ కేంద్రాల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలుకు చర్యలు చేపట్టారు. గత టీడీపీ హయాంలో రూ.లక్షలు ఖర్చుచేసి ఈ కేంద్రాలను నిర్మించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ వీటి నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో ఐదేళ్లపాటు అలంకారప్రాయంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వినియోగంలోకి తెస్తున్నారు. మండలంలో ఇప్పటికే పెరుమాళ్లపల్లె, తిరుచానూరు పంచాయతీల్లోని కేంద్రాల్లో చెత్త నుంచి సంపదను సృష్టిస్తున్నారు. ఇప్పుడు పేరూరులోని చెత్తసంపద కేంద్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దడంపై జిల్లా అధికారులు దృష్టి నిలిపారు. డీపీవో సుశీలాదేవి చొరవతో పేరూరు కేంద్రం వద్ద ఐదేళ్ల నుంచి నిల్వచేరిన దాదాపు 1300టన్నుల చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను రామాపురం డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ స్థలంలో మట్టితోలి ఎక్సవేటర్‌తో చదును పనులు చేపట్టారు. పాడైపోయిన తొట్టెలకు మరమ్మతులు, కేంద్రానికి సంబంధించిన స్థలంలో చుట్టూ హద్దుగా ఫెన్సింగ్ వంటి పనులు జోరుగా చేపడుతున్నారు. కాగా నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న విలువైన భూమి కావడంతో ఇందులో కొంత ఇప్పటికే కొంత భూమి చేతుల్లో ఉందని సమాచారం. దీన్ని సర్వే చేసి రక్షణ చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి అంటున్నారు. కాగా గురువారం ఈ కేంద్రాన్ని డీఎల్‌పీవో సురేష్‌నాయుడు సందర్శించి పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. డీఆర్పీ షణ్ముగరామ్, ఈవోపీఆర్డీ దయాసాగర్, పంచాయతీ కార్యదర్శి రెడ్డి జ్యోతీశ్వరప్రసాద్ పాల్గొన్నారు.



గరుడ వాహనంపై ఊరేగుతున్న సుందరరాజస్వామి

గరుడ వాహనంపై సుందరరాజస్వామి సాక్షాత్కారం

ముగిసిన అవతార మహోత్సవాలు

తిరుచానూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న సుందరరాజస్వామి గురువారం రాత్రి గరుడ వాహనంపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొపి ఆలయంలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం కేటీ మండపంలో ఉత్సవమూర్తులకు సుగంధ పరిమళ ద్రవ్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ అర్చకులు అభిషేకం చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ అత్యంత వేడుకగా జరిగింది. సర్వాలంకార శోభితులైన స్వామివారు గరుడ వాహనంపై కొలువుదీరి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు అభయమిచ్చారు. దీంతో సుందరాజస్వామి అవతార మహోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంగళంలో భూ వివాదం

ఎవరూ ప్రవేశించవద్దని అడ్డుకొన్న రెవెన్యూ అధికారులు

తిరుపతి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండలం మంగళం లెక్కదాఖలా సర్వేనెంబర్ 52/2బిలో ఉన్న 3.86ఎకరాలు భూమిపై తమకే హక్కు ఉందని రెండు వర్గాలు గుమికూడడంతో వివాదస్పదమైంది. ఈ విషయం తెలుసుకున్న వీఆర్వో సతీష్ అక్కడికి చేరుకొని ఇరు వర్గాలను అడ్డుకొన్నారు. ప్రస్తుతం ఈ భూమి జేసీ కోర్టులో వ్యాజ్యం నడుస్తోందని, రెవెన్యూ లెక్కల ప్రకారం సర్వేనెంబర్ 52/2సబ్ డివిజన్ కాలేదని తెలుస్తోందని వీఆర్వో తెలిపారు. అయితే 2004ముందు కిలారి సుబ్రహ్మణ్యంనాయుడు, కిలారి వెంకటరమణనాయుడు రైత్వారీ పట్టా చూపి ఈ భూమిలో వందకు పైగా ప్లాట్లు వేసి విక్రయించినట్లు కొనుగోలుదారులు(ఒక వర్గం) తెలిపారు. 2005 తర్వాత తాము కొన్న స్థలానికి సంబంధించిన సర్వేనెంబర్‌ను నిషేధిత (అనాధీనం) జాబితాలో చేర్చడంతో జేసీ కోర్టును ఆశ్రయించామన్నారు. ఐదేళ్లుగా వ్యాజ్యం నడుస్తోందన్నారు. అయితే న్యూమంగళం గ్రామానికి చెందిన కొంతమంది(మరో వర్గం) ఈ భూమి తమ పూర్వీకులకు సంబంధించిందని, కొందరు లేఅవుట్ వేయడానికి పూనుకోవడంతో మూడు రోజుల కిందట తిరుచానూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. రాయలచెరువు బత్తిరెడ్డి అనే వ్యక్తికి మంగళం గ్రూపు 8లో భూమిని కేటాయించారని, ఆయన వారసులుగా తాము ఎన్నో ఏళ్లుగా చిరుధాన్యాలు పండించుకునే వారమన్నారు. ఆర్థికంగా చితికిపోవడం వల్ల వ్యవసాయాన్ని కొనసాగించలేకపోయామని తమ వద్దవున్న రికార్డులను చూపుతూ ఆందోళనకు గురయ్యారు. ఈ భూమికి తామే హక్కుదారులమని రెవెన్యూ అధికారులను వేడుకున్నారు. ఈ భూమి వివాదంలో ఉందని, జేసీ కోర్టులో తుది తీర్పు వచ్చేంత వరకు ఎవరూ అడుగుపెట్టకూడదని వీఆర్వో సతీష్ గట్టిగా చెప్పడంతో ఇరువర్గాలు వెళ్లిపోయాయి.

ప్రజల ఆస్తులు అమ్మితే పోరాడతాం: వైసీపీ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆస్తులు అమ్మాలని చూస్తే పోరాడతామని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధికార ప్రతినిధులు వాసు, పసుపులేటి సురేష్ గురువారం చెప్పారు. తిరుపతి కార్పొరేషన్‌కు చెందిన చాళుక్య లాడ్జ్ స్థలాన్ని చవగ్గా విక్రయించాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకించిన కార్పొరేటర్లకు, నేతలకు కృతజ్ఞతలు చెప్పారు. ఎంతమంది వ్యతిరేకించినా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాత్రం ఓ కమిటీ వేస్తాననడం అనుమానం కలిగిస్తోందన్నారు.

నక్కల వంకలో అగ్నిప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది

చంద్రగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురం సమీపం శ్రీవారిమెట్టు మార్గంలోని శేషాచలం అడవుల్లోని నక్కల వంక అగ్నికి ఆహుతైయింది. అయితే టీడీపీ సెక్యూరిటీ సిబ్బంది సకాలంలో మంటలను అదుపు చేసారు. గురువారం మధ్యాహ్నం ఎల్‌అండ్‌టీ పంపు హౌస్ ఎదురుగా ఉన్న నక్కల వంకలో మంటలు రేగడంతో టీటీడీ ఏవీఎస్వో రమేష్ క్రిష్ణన్‌కు భక్తులు సమాచారం ఇచ్చారు. ఆయన తన సిబ్బంది, అటవీ సిబ్బంది సహకారంతో జమేధర్ చిరంజీవి ఆధ్వర్యంలో నక్కల వంకలో మంటలను అదుపు చేశారు.

విభిన్నప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించండి


ఏడీ వినోద్‌ను కలిసిన విభిన్న ప్రతిభావంతులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించాలని పీడబ్ల్యూడీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు కలెక్టరేట్‌లో గురువారం ఆ శాఖ ఏడీ వినోద్‌ను కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపటిన విభిన్నప్రతిభావంతుల శాఖ ఏడీకి శుభాకాంక్షలు తెలిపారు. పీడబ్ల్యూడీఫ్ నేతలు మురళిగౌడ్, శ్రీనివాసులు తదితరులున్నారు.

శ్రీసిటీ సీఎఫ్‌వో నాగరాజన్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



సత్యవేడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ సీఎఫ్‌వో (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్) నాగరాజన్‌కు ప్రతిష్టాత్మక 'బెస్ట్ సీఎఫ్‌వో ఇన్ స్మాల్ ఎంటర్ ప్రైజ్'అవార్డు వరించింది. ఈ నెల 18న ముంబైలోని జియో వరల్డ్ ఫైనాన్స్ స్ట్రాటజి ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఉత్తమమ ఆర్థిక ప్రణాళిక, పనితీరుకు ఈ అవార్డు దక్కింది.

ముక్కంటి సేవలో ఏపీటీడీసీ చైర్మన్



శ్రీకాళహస్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణ శివారులోని ఏపీ టూరిజం హరిత హోటల్‌ను బాలాజీ సందర్శించారు. ఆయనకు ఏపీ టూరిజం డివిజన్ మేనేజర్ సీహెచ్ శ్రీనివసారావు స్వాగతం పలికారు.

అవిలాలలో ఓపెన్ డ్రైనేజీ కాలువ పరిశీలన


అవిలాలలో మురుగునీటి వ్యవస్థను పరిశీలిస్తున్న సర్పంచ్ వెంకటరమణ, కార్యదర్శి బాలాజి

తిరుపతిరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీలో అంబేడ్కర్, సుబ్బయ్య కాలనీల మీదుగా పెద్దకాలువ గుండా ప్రవహించే మురుగునీటి వ్యవస్థను గ్రామ సర్పంచ్ చెందిలి వెంకటరమణతో ఇన్‌చార్జి కార్యదర్శి బాలాజీ కలసి గురువారం పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో గురువారం ముందుకెళ్లని మురుగునీరుతో ముప్పుతిప్పలు అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా పంచాయతీ అధికారి స్పందించారు. మురుగునీరు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారని తెలిసింది. దీంతో ఇరువురు కలసి మురుగునీటి కాలువను పరిశీలించారు. సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ కాలువలో మురుగునీరు వెళ్లేందుకు అడ్డుగా ఉన్న మట్టి, వ్యర్థాలు, దీనికి ఆనుకుని ఉన్న మొక్కల తొలగింపు పనులను శుక్రవారం నుంచి చేపట్టనున్నట్లు ఆంధ్రజ్యోతి ప్రతినిధికి వివరించారు.

మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా సరళ


సరళ

ఎర్రావారిపాలెం, జూన్ 19(ఆంధ్ర జ్యోతి); ఎర్రావారిపాలెం మోడల్ కాలేజి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సరళ విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న బీటీఎస్ దేవి కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు. చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టరు సరళ ఇక్కడకు వచ్చారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


రాధామనోహర్ దాస్, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి - రీతు చౌదరి - అల్లు నిర్మల

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాధా మనోహర్‌దాస్, నటి రీతు చౌదరి, సినీ నిర్మాత అల్లు అరవింద్ సతీమణి నిర్మల ఉన్నారు. వీరికి ఆలయ సిబ్బంది ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు రీతుచౌదరి శ్రీపద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

● రూ. ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు చీఫ్ సుబ్బరాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు విచారణ దశలో ఉన్న కేసుల గురించి టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అత్యంత పకడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి నిందితులకు శిక్షలు పడేలా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా తమిళనాడుకు చెందిన పరమన్ అన్బు కరకంబాడి బీట్ పరిధిలోని కృష్ణాపురం సెక్షన్ పరిధిలో పట్టుబడ్డాడు. ఇతడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

భూసేకరణ పరిహారంపై విచారణ

సత్యవేడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లడం, చిన్న ఈటిపాకం గ్రామాల్లో ఏపీపీఐసీ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న భూసూకరణకు సంబంధించి పరిహారంపై సూళ్ళూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో గురువారం విచారణ చేపట్టారు. తహసీల్దార్ రాజశేఖర్ పర్యవేక్షణలో ఆయా గ్రామాల్లోని రైతుల నుంచి పట్టాదారు పుస్తకం, టైటిల్ డీడ్ తదితర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో భాగంగా కొల్లడంలో ముగ్గురు రైతులు, చిన్నఈటిపాకంలో 28 మంది రైతులు తమ హక్కు పత్రాలను అధికారులకు అందజేసి వివరాలను నమోదు చేసుకున్నారు. అవార్డు ఎంక్వైరీలో ఓజిలి తహసీల్దార్ పద్మావతి, బుచ్చినాయుడు కండ్రిగ డీటీ రవిచంద్ర, ఆర్డీవో కార్యాలయం ఏవో రవికుమార్, సత్యవేడు డీటీ త్యాగరాజు, ఆర్ఐ సురేష్, వీఆర్వో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్లయినా జగన్‌ను ప్రజలు నమ్మరు

● డిప్యూటీ మేయర్ మునికృష్ణ



మీడియా సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మునికృష్ణ తదితరులు

తిరుపతి(విద్య), జూన్ 19(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లు కాదుకదా 40ఏళ్ల అయినా జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు నమ్మరని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ విమర్శించారు. బాబాయిని చంపడమేగాక తల్లిని, చెల్లిని ఇంట్లో నుంచి తరిమేసిన వ్యక్తిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే జగన్ విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పరామర్శకు పద్ధతిగా వెళ్లాలే తప్పా దండ యాత్ర తరహాలో ఉండకూడదని హితవుపలికారు. పోలీసులను బెదిరించడం సరికాదన్నారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు మాట్లాడుతూ వైసీపీ నాయకుడు నాగమల్లేశ్వర్‌రావు ఏడాది క్రితం ఆత్మహత్యకు పాల్పడితే ఇప్పుడు జగన్ పరామర్శకు వెళ్లడమేమిటని ప్రశ్నించారు. పైగా ఆయన మాటతీరుతో రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించే ప్రమాదం ఏర్పడిందన్నారు. తీరు మార్చుకోకపోతే ప్రజలు శాశ్వతంగా రాజకీయాల్లో లేకుండా చేస్తారని హెచ్చరించారు. టీడీపీ నాయకులు కరాటే చంద్ర, విశ్వనాథం, సుబ్బుయాదవ్, ధనుంజయ, జగన్నాథం పాల్గొన్నారు.

నిధుల దోపిడీని ఆధారాలతో నిరూపించాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

తిరుపతి అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో నిధులు దోచేస్తున్నట్లు చేస్తున్న ఆరోపణలను వైసీపీ నేతలు సాక్ష్యాధారాలతో నిరూపించాలని జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి సవాల్ విసిరారు. గురువారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ వైసీపీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. నగరపాలక సంస్థ ఖాళీ స్థలాలను విక్రయించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కౌన్సిల్లో కూడా అజెండా పెట్టామని, కార్పొరేటర్ల అభిప్రాయాలను సేకరించామని అన్నారు. ఇప్పటివరకు ఎక్కడా విక్రయాలు జరగలేదని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ స్థలాలు, చెరువులను మింగేశారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుటుంబం స్మార్ట్‌సిటీ, టీటీడీ నిధులు దోచేసిన విషయం అందరికీ తెలుసన్నారు. అందుకే 63 వేల ఓట్ల మెజారిటీతో జనసేనను గెలిపించారన్నారు. కూటమి పాలనలో అవినీతికి తావులేదని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో, ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో ఆకేపాటి సుభాషిణి, లక్ష్మి, రాధ, అనిల్‌రాయల్, సుమన్‌బాబు, మునస్వామి, వంశీ, వెంకటేష్, జిన్నాబాషా తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే జగన్ హడావుడి



మాట్లాడుతున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మానసిక స్థితి బాగోలేదని, అందుకే పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని, ఉనికి కోసమే ఆయన హడావుడి చేస్తున్నారని జనసేన నేత కిరణ్‌రాయల్ విమర్శించారు. గురువారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ మాజీ సీఎం బుల్లి ఉగ్రవాద సంస్థను నడుపుతున్నారని, పద్ధతి మార్చుకోకుంటే ఆయన ఇంటి ముందే మెంటల్ ప్యాలెస్ బోర్డు పెడుతామని అన్నారు. ఎక్కడ పర్యటించినా హడావుడి చేస్తున్నారని, గంజాయి బ్యాచ్‌ను పరామర్శించడం ఏంటని ప్రశ్నించారు. నాయకులనే కాదు కార్యకర్తలను రెచ్చగొట్టి జైలుకు పంపుతున్నారని మండిపడ్డారు. నరకండి, చంపండి అంటూ ఆయన సమాజానికి ఏం మెసేజ్ ఇస్తున్నారని నిలదీశారు.

తిరుపతి

నేడు రక్తదాన శిబిరం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో కొప్పర్ల లక్ష్మీ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ తిరుమల ఎండీ కొప్పర్ల దివాకర్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే రక్తదాన శిబిరంలో యువత, నందమూరి అభిమానులు, నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాలలను విలీనం చేయొద్దు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలంలోని పీవీపురం, పరమాల గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆదర్శ పాఠశాలల పేరుతో విలీనం చేయొద్దని సీపీఎం, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ వేంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జయచంద్ర మాట్లాడుతూ పీవీపురంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బలిజపల్లి గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో విలీనం చేశారన్నారు. దీంతో పక్కనే ఉన్న రామిరెడ్డిపల్లి, ఎస్టీకాలనీ, గంగమాంబపురం, పీవీపురం గ్రామాల నుంచి విద్యార్థులు రాష్ట్ర రహదారిపై నడిచి వెళ్లాల్సి వస్తోందని, తద్వారా ప్రమాదాలు జరిగే అవకాశముందని వివరించారు. పీవీపురంలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, అక్కడ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రూరల్ కార్యదర్శి సుమన్, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్ కుమార్, తేజ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

వీఆర్వోల సమస్యలను పరిష్కరించండి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోల సంఘ నేతలు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులును కలిసి వినతిపత్రం ఇచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణతో రాష్ట్ర వ్యాప్తంగా 7,500మంది వీఆర్వోలను మిగులు సిబ్బందిగా చూపడం సరికాదన్నారు. పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన పాతపద్ధతిలోనే ప్రతి గ్రామానికీ ఒక వీఆర్వోను నియమించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ నుంచి వీఆర్వోలకు మినహాయింపు ఇవ్వాలని, అర్హులైన వారికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టేటి మనోజ్‌కుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామానుజం నాగరాజు, కోశాధికారి భాస్కర్ పాల్గొన్నారు.

హథీరాం బావాజీ జయంతిని విజయవంతం చేద్దాం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): హథీరాం బావాజీ జయంతిని ఈనెల 29, 30 తేదీల్లో తిరుమల మఠంలో ఘనంగా నిర్వహించనున్నట్లు హథీరాం బావాజీ పరిరక్షణ సమితి ఛైర్మన్, బి.శివనాయక్ తెలిపారు. బంజారాలందరూ ఈ ఉత్సవాల్లో విజయవంతం చేయాలని కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుమలలోని హథీరాం బావాజీ మఠంలో కనీస సౌకర్యాలు లేని కారణంగా బంజారా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, టీటీడీ అధికారులు స్పందించి మెరుగుపరచాలని కోరారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(వైద్యం), జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ 54వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని రాజీవగ్‌గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి నేతలు సంబరాలు జరుపుకున్నారు. చిట్టిబాబు మాట్లాడుతూ దేశ సమగ్ర అభివృద్ధికి రాహుల్‌గాంధీ వంటి నేతలు అవసరమన్నారు. కాంగ్రెస్ నగర మాజీ అధ్యక్షుడు గోపీగౌడ్ ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు రాంభూపాల్‌రెడ్డి, కళందర్, సుప్రజ, పార్థసారధిరెడ్డి పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

తిరుపతి జిల్లా, తిరుపతి అర్బన్ మండలం, మధురానగర్, డోర్ నెం. 18-8-25/9రులో కాపురముండు బి. విజయలక్ష్మి, భర్త లేట్ గోవర్ధన్ రెడ్డి, తరపున తెలియజేయడం ఏమనగా సదరు బి. విజయలక్ష్మి 14-06-2025న చంద్రగిరి బస్‌స్టాపు నందు వేచి వుండగా ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 424/1969, తేది: 20-06-1969 మరియు 353/1986, తేది: 24-03-1986లు దారి పోయినవి. అప్పటి నుండి చాలా చోట్ల వెతుకగా దొరకలేదు. సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన మాకు స్వాధీనము చేసినయెడల మంచి బహుమతి ఇవ్వబడును. సదరు డాక్యుమెంట్లలో ఎవరైనా, ఏదైనా వ్యవహారములు జరిపినయెడల అట్టివారలపై నా క్లయింటు తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెలియజేయడమైనది.

షెడ్యూలు వివరములు :- 1) డాక్యుమెంట్ నెం. 424/1969, తేది : 20-06-1969 యొక్క షెడ్యూలు వివరములు - తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, తొండవాడ గ్రామ లెక్కదాఖలా నెం. 61, భాగపరిష్కారపు షెడ్యూలు. 2) డాక్యుమెంటు నెం. 353/1986, తేది : 24-03-1986 యొక్క షెడ్యూలు వివరములు తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, తొండవాడ గ్రామ లెక్కదాఖలా, సర్వేనెం. 730/1, 732/5రులో ఎ.0.43 సెంట్లు మాత్రమే.

ఎ. వెంకటేశులు, అడ్వకేట్, తిరుపతి

చంద్రబాబు, లోకేశ్ ప్రజాస్వామ్య రేఖను దాటనివ్వలేదు!

మాజీ సీఎం జగన్ ఆరోపణలపై టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం



తిరుపతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ అధినేతలు చంద్రబాబు, లోకేశ్‌లు తనను ఎప్పుడూ ప్రజాస్వామ్య రేఖను దాటనివ్వలేదని స్పష్టం చేశారు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం. తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేసిన బాలసుబ్రమణ్యం ఇటీవల రేణిగుంటలోని సాక్షి పత్రిక కార్యాలయంపై దాడి ఘటనలో కూడా పాల్గొన్నారంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ తాజాగా కోడూరు బాలసుబ్రమణ్యంపై ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఆయన జగన్ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. టీడీపీ అధినేతలు చంద్రబాబు, నారా లోకేశ్ నాయకత్వంలో నిబద్ధతతో పనిచేసే తాను ఏ పరిస్థితుల్లోనూ ప్రజాస్వామ్యాన్ని దాటి పోలేదని స్పష్టం చేశారు. వైసీపీ తరహాలో ఓటర్లను బెదిరించడం, కార్పొరేటర్లను కిడ్నాప్ చేయడం, నకిలీ ఏకగ్రీవాలు చేసుకోవడం వంటివి తమ పార్టీ విధానాలు కాదని తెలిపారు. మహిళల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిన కారణంగా సాక్షి కార్యాలయం ప్రజల ఆగ్రహానికి గురైందని వివరించారు. జగన్ ప్రజా స్వామ్యం గురించి మాట్లాడ డమే విడ్డూరంగా ఉందని, వైసీపీ హయాంలో ఎన్ని కలు ఎలా జరిగాయో ప్రజలకు తెలుసునని ఎద్దే వా చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మీడియాకు వెల్లడించారు.

సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించండి

తిరుపతి, జూన్19(ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను కమిషనర్ గురువారం కొర్లగుంట, సాయివిష్ణు లేఔట్, ఈఎస్ఐ ఆస్పత్రి, తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రాంతాలను అధికారులతో కలసి పరిశీలించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా నిర్మాణాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాయి విష్ణు లేఔట్‌లో నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్ నిబంధనల మేరకు ఉందా లేదా మరోసారి పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద కాలువలో చెత్తను తొలగించి, పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలన్నారు. కమిషనర్ వెంట సర్వేయర్ కోటేశ్వరరావు ఉన్నారు.



దళితుల్లో ఐకమత్యం అవసరం

తెలంగాణ కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లోని దళితుల మధ్య మరింత ఐకమత్యాన్ని సాధించాల్సిన అవసరం ఉందని తెలంగాణ కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ పేర్కొన్నారు. గురువారం తిరుపతిలో మాజీ మంత్రి పరసారత్నం నివాసానికి వచ్చిన మంత్రి వివేక్‌ను దళిత సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ దళితులు ఐకమత్యంతోనే సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధిని సాధించగలరని చెప్పారు. మాలల హక్కుల కోసం పటిష్ట ఉద్యమాన్ని చేపడతామన్నారు. దళితులతో పాటు బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి తాను పని చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంట్రపాటి శ్రీనివాసరావు, రిటైర్డు జడ్జి గుర్రప్ప, ఆర్పీఐ అధ్యక్షుడు అంజయ్య, ప్రసాదరావు, మధు, ప్రభాకర్, చేతన్, బాలకృష్ణ, అశోకరత్నం, ధనశేఖర్, మురళి, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న దళిత సంఘాల నేతలు

పల్లా సింహాచలంకు ఓబీసీ ఫోరం నివాళి



సింహాచలం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఓబీసీ ఫోరం నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, ఓబీసీ ఫోరం జాతీయ నేత, స్వాతంత్ర్య సమరయోధులు, విశాఖ ఉక్కు ఉద్యమకారుడు పల్లా సింహాచలంకు ఓబీసీ ఫోరం ఘన నివాళి అర్పించింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌ను ఓబీసీ ఫోరం నేతలు గురువారం పరామర్శించారు. అంతకు ముందు పల్లా సింహాచలం చిత్రపటానికి వారు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. పల్లా సింహాచలం చేసిన సామాజిక సేవను వారు కొనియాడారు. జాతీయ ఓబీసీ ఫోరం నాయకులు డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, డాక్టర్ భూషణ్, డాక్టర్ వీరు, డాక్టర్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల శరణాలయానికి తలుపుల వితరణ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): శివజ్యోతి నగర్‌లోని అంధుల శరణాలయానికి జగత్‌గురు సేవా సమితి తలుపులు వితరణ చేసింది. శరణాలయంలోని చెక్క తలుపులు పూర్తిగా పాడైపోవడంతో సేవా సమితి అధ్యక్షుడు మోహన్‌రామిరెడ్డి రూ.40 వేల విలువైన ఇనుప తలుపులను గురువారం అందజేశారు. అంతకు ముందు శరణాలయం ఆవరణలోని లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి ఉపాధ్యక్షులు గోవిందరెడ్డి, కార్యదర్శి విశ్వనాథ్, కోశాధికారి చంద్ర, శశి సందీప్, బీజేపీ నేత గుండాల గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



గంగమ్మ హుండీ ఆదాయం రూ.43.86 లక్షలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.43.86లక్షలు వచ్చినట్లు ఈవో జయకుమార్ తెలిపారు. మే 15 నుంచి జూన్ 19వ తేదీ వరకు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఇందులో రూ.43,86,409 నగదు, 23 గ్రాముల 100 మిల్లీ గ్రాముల బంగారం, 328 గ్రాముల వెండి ఉన్నట్లు ఈవో వివరించారు. ఆలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఈస్ట్ పోలీసు స్టేషన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6 నుంచి 9వ తరగతి వరకున్న మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాయుడుపేట, చిల్లకూరు, కోట, వాకాడులోని బాలుర పాఠశాలలు.. పుదూరు, సూళ్ళూరుపేట, డక్కిలి, సత్యవేడు, శ్రీకాళహస్తి, పుత్తూరులోని బాలికల పాఠశాలల్లో మిగులు సీట్లకు ఆయా విద్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 25న శ్రీకాళహస్తిలోని బాలికల పాఠశాలలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన కొత్త అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. వీరిలో విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్, ఆర్కియాలజీ, మ్యూజియం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రజిత ఉన్నారు.





కలెక్టర్‌ను కలిసిన వినోద్, రజిత ←

శ్రీహరి సర్వదర్శనానికి 14 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,440
తలనీలాలు సమర్పించినవారు: 33,687



ఉగ్రవాదులను ఎదుర్కొంటాం





● తిరుమలలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

అతిథిగృహం ముందు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బంది

తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వీవీఐపీలు బస చేసే పద్మావతి అతిథిగృహంలో బుధవారం అర్ధరాత్రి ఆక్టోపస్ మాక్‌డ్రిల్ జరిగింది. దేశసరిహద్దుల్లో గతంలో నెలకొన్న యుద్ధపరిస్థితుల నేపథ్యంలో తిరుమల, తిరుపతిలో ఆక్టోపస్, పోలీసులు వరుసగా మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే పద్మావతి అతిథి గృహంలోనూ మాక్‌డ్రిల్ నిర్వహించారు.

మాక్ డ్రిల్ సాగిందిలా..

పద్మావతి అతిథిగృహంలో ఉగ్రవాదులు ప్రవేశించారని బుధవారం రాత్రి 9.20 గంటలకు తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ఆక్టోపస్ కమాండ్ కంట్రోల్‌కు సమాచారాన్ని చేరవేశారు. స్పందించిన ఆక్టోపస్ అధికారులు, వివిధ విభాగాల సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. అత్యంత స్పష్టమైన ప్రణాళికతో మాక్ ఆపరేషన్‌ను ప్రారంభించారు. ప్రణాళిక ప్రకారం ఆక్టోపస్ సిబ్బంది ఆయుధాలతో అతిథిగృహం వద్దకు చేరుకుని ఓ అగంతకుడిని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు ఉగ్రవాదులను హతమార్చారు. గాయపడిన ఓ సెక్యూరిటీ గార్డును ఆస్పత్రికి తరలించారు. అనుకున్న విధంగానే ఆపరేషన్‌ను ఐదుగంటల్లో పూర్తిచేసి మాక్‌డ్రిల్‌ను ముగించారు. ఈ ఆపరేషన్‌లో ఆక్టోపస్‌తో పాటు స్థానిక పోలీసులు, రిజర్వ్ పోలీసులు, టీటీడీ విజిలెన్స్, బాంబ్ స్క్వాడ్, ఫైర్ టీం, మెడికల్ విభాగాలు పాల్గొన్నాయి.





అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

శాఖల వారీగా భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ

● టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడి

తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు టీటీడీలో అందిస్తున్న సేవలపై క్రమం తప్పకుండా అభిప్రాయ సేకరణ జరిపి, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు భక్తుల నుంచి సేకరించిన ఫీడ్‌బ్యాక్‌పై చర్చించారు. శ్రీవారి దర్శనం, అన్నప్రసాదాలు, వడ పంపిణీ, వసతి, కాలినడక భక్తులకు అందజేస్తున్న సేవలు, లగేజీ, కల్యాణకట్ట, వైద్యం, పారిశుద్ధ్యం, విజిలెన్స్, ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలపై భక్తుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నామని, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వెంగమాంబ అన్నప్రసాద భవనంలో పెరిగిన రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు హాళ్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. అన్నప్రసాదాల పంపిణీలో ఆలస్యం చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. బియ్యం, ముడిసరుకుల నాణ్యతను పరీక్షించేందుకు ఆధునిక పరికరాలను ఉపయోగించి మరింత రుచికరమైన అన్నప్రసాదాలను అందించాలన్నారు. వసతి గృహాల్లో సకాలంలో పరిశుభ్రతా ప్రమాణాలను పాటించేందుకు వీలుగా రిసెప్షన్, ఐటీ విభాగాలు సమన్వయంతో ఎఫ్ఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రద్దీ సమయాల్లో లడ్డూ కౌంటర్ వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా పంపిణీ జరగాలన్నారు. రద్దీకి తగినట్టు సిబ్బందిని పెంచాలన్నారు. ట్రాన్స్‌పోర్టు, కల్యాణకట్టల్లోని భక్తుల వసతులపై అధిక శ్రద్ధ వహించాలన్నారు. తిరుమలలో వసతి బస్సుల సదుపాయ సమాచారాన్ని మైకుల ద్వారా ప్రకటనలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి(వర్చువల్), జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలు, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక హెల్ప్‌లైన్

● పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తాం ● జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ వెల్లడి

తిరుపతి(వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'మహిళల రక్షణ, వారి హక్కుల పరిరక్షణకు మహిళా కమిషన్ 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. మీ సమస్యలపై ప్రత్యేక హెల్ప్‌లైన్, మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. వీటిపై తక్షణమే విచారించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం' అని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్రీయ మహిళా అయోగ్ ఆప్కేద్వార్, మహిళా జన్‌సున్వై కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరకట్నం, సైబర్ నేరాలు, లైంగిక నేరాలు తదితర సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో పెండింగులో ఉన్న మహిళా కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళల సమస్యలను పరిష్కరించే దిశగా 8 జిల్లాల గ్రీవెన్స్‌కు సంబంధించి ఈ మహిళా జన్‌సున్వై కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేఖాయ బేగం మెంబర్, అడ్వకేట్‌లు కంచి శ్యామల, కోమలాదేవి శారద, నేశమ చౌదరి, చంద్రశేఖర్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి వసంతబాయి, పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను డాక్టర్ అర్చన మంజుదార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని అధికారులను ఆమె ఆదేశించారు.



సమస్యను వింటున్న మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్, అధికారులు

● ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ సాయిలక్ష్మి సమక్షంలో కొందరు ఆమెకు వినతిపత్రాలను సమర్పించారు. భూ అమ్మకంలో మధ్యవర్తిగా వ్యవహరించినందుకు తిరుచానూరు పోలీసులు హేమలత అనే మహిళపై దాడికి పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు.

● 'తిరుపతి రూరల్ మండలం బీటీఆర్ అంబేడ్కర్ కాలనీకి చెందిన ఆటో కార్మికురాలు భాగ్యశ్రీతో మాట్లాడాలని ఇంటికి పిలిపించి ధనశేఖర్ అనే వ్యక్తి మరికొంత మందితో కలిసి దాడి చేశారు. ప్రధాన నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చకుండా పోలీసులు తప్పించారు' అంటూ వినతి పత్రం అందించారు. 15 రోజుల్లోపు వీటిపై విచారించి తమకు నివేదిక పంపాలని పోలీసు అధికారులకు కమిషన్ సభ్యురాలు ఆదేశించారు.

ప్రసూతి ఆస్పత్రి తనిఖీ

తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చనమంజుదార్ గురువారం తనిఖీ చేశారు. పలు వార్డులను పరిశీలించారు. వైద్యసేవల గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. మహిళల రక్షణ, హక్కులపై అవగాహన కల్పించే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పది మంది కంటే ఎక్కువ మంది మహిళలు పని చేసే కార్యాలయాల్లో, సంస్థల్లో ఐసీసీ(ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ)ని ఏర్పాటు చేయాలన్నారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రాధా, పార్థసారధిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పల్లం పాఠశాలలో శ్రీలంక ప్రతినిధులు

ఏర్పేడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో విద్యావ్యవస్థ అధ్యయనంలో భాగంగా శ్రీలంకకు చెందిన సుమారు 45మంది విద్యావేత్తలు గురువారం మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బోధనా విధానం, ఉపాధ్యాయల పనితీరు పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో సమకూర్చిన వసతులపై వారు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. భారతదేశంలో విద్యావ్యవస్థ చాలా పటిష్ఠంగా ఉందని శ్రీలంక ప్రతినిధులు మహేందర్, పెరారీ కొనియాడారు. శ్రీలంక మహిళా ఉపాధ్యాయులు తమ దేశ సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. అనంతరం వారిని ఉపాధ్యాయులు సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, శ్రీనివాసులు, బాబు, సోమశేఖర్, వాణి, విజయ, శేఖర్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు కేవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఏర్పేడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ఏర్పేడు ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయంలో పలు తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమేస్ బజ్జూరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు నేరుగా తమను సంప్రదించవచ్చన్నారు: 1వ తరగతిలో ఎస్టీ 1, సీడబ్ల్యూఎస్ఎన్ 1, 2వ తరగతిలో ఎస్టీ 1, 3వ తరగతిలో ఎస్టీ 1, 4వ తరగతిలో 26, 5వ తరగతిలో ఎస్సీ 1, ఎస్టీ 1ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచండి

● రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

తిరుపతి(సెంట్రల్), జూన్19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచాలని సికింద్రాబాద్ జోనల్ జీఎం అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో గురువారం ఆయన తనిఖీ చేశారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఉత్తరం వైపు జరుగుతున్న పనుల్లో ఆలస్యంపై ఆరా తీశారు. నిర్ణీత సమయంలోపు భవనాల నిర్మాణాలను పూర్తి చేసి అప్పగించాన్నారు. ఈ తనిఖీల్లో జోనల్, డివిజన్ స్థాయి అధికారులు సీఈ కె.సూర్యనారాయణ, డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, మల్లాడి శ్రీనివాస్, జి.వామనమూర్తి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, మణికంఠ, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యానారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నప రెడ్డి, ఎస్ఎస్ఈ మాధవరావు తదితరులు పాల్గొన్నారు. ఈ నెలాఖరుకు జీఎం అరుణ్ కుమార్ జైన్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా అధికారులు ఘనంగా సన్మానించారు.



తిరుపతి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జీఎం అరుణ్ కుమార్ జైన్

కుల ఆధిపత్య రాజకీయాలకు

ప్రత్యామ్నాయంగా ఏఐబీఎస్పీ

● జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు వెల్లడి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): కుల ఆధిపత్య రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా, బహుజనులను అధికారంలోకి తెచ్చేందుకు ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) ఏర్పాటైందని ఆ పార్టీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో రెండు ఆధిపత్య కులాలే రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుంటున్నాయి. బహుజన కులాల్లో చీలికలు తెచ్చి, వారిని తమ వెంట నడిపించుకుంటూ అధికారాన్ని అనుభవిస్తున్నాయి. అందుకని బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రిస్టియన్లను ఏకతాటిమీదకు తీసుకొచ్చి వారికి రాజ్యాధికారమే లక్ష్యంగా ఏఐబీఎస్పీ కృషి చేస్తుంది' అని వివరించారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ పదవులు ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో రెండు కులాల పార్టీలకు రాజకీయసమాధి కట్టి, బహుజన కులాలను అధికారంలో తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏఐబీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి, ఒంగోలు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, విద్యార్థి సంఘం నాయకులు వెంకటస్వామి, బీసీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, ప్రముఖ న్యాయవాది మునయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు



సికిల్ సెల్ అనీమియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

84 వేల మందికి సికిల్ సెల్ అనీమియా పరీక్షలు

తిరుపతి(వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'సికిల్ సెల్ అనీమియా.. వారసత్వంగా వచ్చే వ్యాధి. దీని నివారణకు జిల్లాలో విస్తృతంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికి 84 వేల మందికి పరీక్షలు నిర్వహించగా నెగటివ్ వచ్చింది' అని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ తెలిపారు. ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినం సందర్భంగా గురువారం తిరుపతిలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2047 నాటికి సికిల్ సెల్ అనీమియాను పూర్తిగా తొలగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటికే 1,24,000 మందికి సికిల్ సెల్ అనీమియాకు స్క్రీనింగ్ పరీక్షలు చేయాల్సి ఉండగా.. వీరిలో 84 వేల మందికి పరీక్షలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఓ బాలికను తీసుకెళ్లిన ఘటనలో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలానికి చెందిన ఓ 15 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ప్రభు అనే యువకుడు గత నెల 30వ తేదీన బయటకు తీసుకెళ్లాడు. వెంకటగిరిలోని అతడి బంధువుల ఇంట్లో ఉంచాడు. దీనిపై బాలిక తల్లి తండ్రులు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. పోలీసుల దర్యాప్తులో ఆ బాలికను ప్రభు తీసుకెళ్ళినట్లు తెలిసింది. వెంకటగిరికి వెళ్లి బాలికను తీసుకొచ్చి గురువారం తల్లితండ్రులకు అప్పగించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. త్వరలో అతడిని అరెస్టు చేస్తామని ఎస్ఐ చెప్పారు.



ఆలయంలో గణపతి సచ్చిదానంద

తాపత్రయం వద్దు.. క్రమశిక్షణతో స్వామిని దర్శించండి

● గణపతి సచ్చిదానంద సూచన

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తాపత్రయ పడకుండా, క్రమశిక్షణతో దర్శించుకోవాలని దత్తపీఠం గణపతి సచ్చిదానంద సూచించారు. తొక్కిసలాటలకు దూరంగా ఉండాలన్నారు. తిరుమల ఆలయ మహాద్వారం వద్దకు గురువారం ఉదయం చేరుకున్న సచ్చిదానందకు టీటీడీ అర్చక బృందం, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. అనంతరం మూలమూర్తిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. సాలిగ్రామంగా ఉన్న తిరుమల కొండపై చెప్పులు కూడా వేసుకోకూడదన్నారు. ఒకప్పుడు స్వామి అందరితో మాట్లాడేవారని, క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగిన క్రమంలో ఆయన రాయిగా మారి నిలుచుండి పోయారని పేర్కొన్నారు. స్వామి వద్దకు వచ్చి కష్టం చెప్పుకుంటే ఇట్టే తొలగిపోతాయన్నారు. పైసా హుండీలో వేస్తే పది పైసలు స్వామి ప్రసాదిస్తారన్నారు. టీటీడీ యాజమాన్యం కూడా కానుకలను సమర్థంగా వినియోగిస్తోందని అభినందించారు. ప్రస్తుతం యుద్ధ భయం నెలకొని ఉందని, పరమాత్ముడు ఇచ్చిన భూమిపై ఎందుకు కొట్టుకోవాలని ఆయన ప్రశ్నించారు. శాంతిగా ఉండే బుద్ధిని అందరికీ ప్రసాదించాలని కోరుకున్నట్టు చెప్పారు. తాను ఓ ఆలయాన్ని కడుతున్న క్రమంలో స్వామికి చెప్పి ఆశీస్సులు పొందేందుకు వచ్చానన్నారు. భవిష్యత్తులో అమెరికాలోనూ ఆలయాన్ని నిర్మించబోతున్నట్టు వెల్లడించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు



జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

శ్రీకాళహస్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కావలి శివకుమార్, తోట గణేష్, రవికుమార్‌రెడ్డి, జ్యోతీరామ్, సురేష్, వెంకటరమణయాదవ్, లక్ష్మి, రాజ్యలక్ష్మి, మాలతి, దినేష్, ఉదయ్, సాయి, వినోద్ పాల్గొన్నారు.

● ఆర్టీసీ బస్టాండు వద్దరు జనసేన తొట్టంబేడు మండల ఇన్‌ఛార్జి పేట చంద్రశేఖర్, నాయకులు పేట చిరంజీవి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి, నాయకులు లక్ష్మణ్, ప్రదీప్‌కుమార్, మణి, గరికపాటి చంద్ర, పగడాల ప్రతాప్ పాల్గొన్నారు.

బాధితులకు సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

శ్రీకాళహస్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఓ వరమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గానికి సంబంధించి పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.24,62,489 మేర ఆర్థిక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తూ ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయకుమార్, అక్కింతల కృష్ణయాదవ్, మునిరాజానాయుడు, చంద్రారెడ్డి, బాషా, ఏర్పేడు మండలాధ్యక్షుడు నాగరాజునాయుడు, నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు. **రేణిగుంట:** సీఎం రిలీఫ్ పండు చెక్కులను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బాధితులకు అందజేశారు. గురువారం ఊరుందూరులో రేణిగుంట మండలం గాజులమండ్యం, కరకంబాడి, రేణిగుంట, తుకివాకం గ్రామాలకు చెందిన బాధితులకు రూ.5.70 లక్షల చెక్కులను అందజేశారు.


బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

విద్యార్థులకు కిట్ల పంపిణీ



శ్రీకాళహస్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. 19వ వార్డు పరిధిలోని ఎంఎంవాడ పాఠశాలలో యూనిఫాం, షూస్, బ్యాగులు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిట్లు అందజేయడం సంతోషకరమన్నారు. మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు గోపీనాథ్, శివయ్య, వాసునాయుడు, చెంచయ్య, మధు, చంద్ర, గుత్తా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సుపై అవగాహన

నారాయణవనం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులపై రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు అవగాహన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ జయరాములు ఒక ప్రకటనలో తెలిపారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): లోకసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కాంగ్రెస్ నాయకులు కరీముల్లా, సురేంద్రరెడ్డి, ఆంటోని, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

నేడు భానుప్రకాష్ జన్మదిన వేడుకలు

పుత్తూరు అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు పుత్తూరు పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఉదయం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కటింగ్ కుఏర్పాట్లు చేశారు. ప్రజలు, పార్టీ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చార

ముక్కంటి సేవలో ఏపీటీడీసీ చైర్మన్



శ్రీకాళహస్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణ శివారులోని ఏపీ టూరిజం హరిత హోటల్‌ను బాలాజీ సందర్శించారు. ఆయనకు ఏపీ టూరిజం డివిజన్ మేనేజర్ సీహెచ్ శ్రీనివసారావు స్వాగతం పలికారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన

సత్యవేడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్ రక్తహీనతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. . ప్రతి ఒక్కరు సికిల్ సెల్ అనీమియా నిర్ధారణకు మాస్ స్క్రీనింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా గంగమ్మ నిమజ్జనం

పిచ్చాటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐదు రోజులుగా జరుగుతున్న గంగ జాతర ఉత్సవంలో భాగంగా గురువారం అమ్మవారికి కుంభం కూడు కార్యక్రమం ఘనంగా జరిగింది. అమ్మవారి ఎదుట కుంభం పోశారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా గ్రామ పొలి మేరలకు తీసుకెళ్లి చెంప కొట్టి చెరువులో నిమజ్జనం చేయడంతో జాతర ముగిసింది.

టీడీపీ నాయకుడికి పరామర్శ

శ్రీకాళహస్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని అమరా ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకులు బాలకృష్ణారెడ్డిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విలీనం వద్దు అప్‌గ్రేడ్ చేయండి

నారాయణవనం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని పిల్లలను మరో పాఠశాలకు పంపలేమని తుంబూరు హరిజనవాడ వాసులు నిరసన వ్యక్తం చేశారు. తమ ఊరి పాఠశాలనే అప్‌గ్రేడ్ చేయాలని వారు గురువారం ఎంఈవోకు వినతి పత్రం అందజేశారు. తుంబూరు హరిజనవాడలో సుమారు 53 మంది విద్యార్థులు ఉన్నారు. 3, 4, 5 పిల్లలను తుంబూరులో ఎంపీయూపీ పాఠశాల విలీనం చేసి, అక్కడకు వెళ్లాలని ఉపాధ్యాయులు చెప్పారన్నారు. తమ హరిజనవాడలోని పాఠశాలకే అన్ని వసతులు కల్పించి అప్‌గ్రేడ్ చేసి చదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.


జన్మదిన శుభాకాంక్షలు
శ్రమించడం ఆయన సుగుణం
సాధించడం ఆయన నైజం
తండ్రి ఆశయ సాధనే ఆయన ధ్యేయం
ప్రజా శ్రేయస్సే ఆయన లక్ష్యం
మచ్చలేని మహామనిషి, మా శ్రేయోభిలాషి
నగరి శాసనసభ్యులు
శ్రీ గాలి భానుప్రకాష్ గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
డా॥ గోవిని బాలసుబ్రమణ్యం
MBBS, MS, MCh (C TVS), FIACS,
Director, C TVS &
Thoracic Organ Transplantation
గోవిని బాబు నాయుడు
నగరి నియోజకవర్గం
చిత్తూరు జిల్లా
గోవిని రమేష్ నాయుడు
నగరి నియోజకవర్గం
చిత్తూరు జిల్లా
పి.లోకనాథం నాయుడు
నింద్ర మండలం టీడీపీ మాజీ అధ్యక్షులు,
మాజీ సర్పంచ్, చవరంబాకం గ్రామం
నగరి నియోజకవర్గం, చిత్తూరు జిల్లా
ఉదయ్
చిట్టి
విష్ణు
శ్రీ గాలి భానుప్రకాష్ గారు
నగరి శాసనసభ్యులు
నింద్ర మండలం టీడీపీ నాయకులు, ప్రజలు
నగరి నియోజకవర్గం


జన్మదిన శుభాకాంక్షలు
శ్రీకాళహస్తి జనం గెండె చప్పుడు ...
ఒక తరాన్ని తన నడత ప్రవర్తన రాజకీయంతో
తీవ్రంగా ప్రభావితం చేసిన యువ నాయకుడు,
తను సమాజం మీద, వ్యక్తుల మీద
వేసిన బలమైన ముద్రలు
ఎన్నటికీ చెరగనివి శాశ్వతమైనవి.
మూడు దశాబ్దాల రాజకీయ జీవితం ఇక
మహోజ్వలంగా సాగాలని ఆశిస్తూ ...
ఆత్మ బంధువు, మిత్రుడు
శ్రీ కోలా ఆనంద్ కు
జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ శ్రీనివాస రామానుజుల వారి
దివ్యాశీస్సులతో
మద్దిపట్ల ప్రసాద్ నాయుడు
శ్రీ కోలా ఆనంద్ గారు
బిజెపి రాష్ట్ర కార్యదర్శి,
మాజీ చైర్మన్, శ్రీకాళహస్తీశ్వరసామి దేవస్థానం
Shree Venkateswara Construction Company
HYDERABAD • BANGLORE • TIRUPATHI


LEADER
LEADER
నగరి నియోజకవర్గ శాసనసభ్యులు
గౌ॥ శ్రీ గాలి భానుప్రకాష్ గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
గంజి మాధవయ్య
డైరెక్టర్, ఏ.పి.స్టేట్ పద్మశాలి
కార్పొరేషన్, పుత్తూరు


ప్రజాసేవకునికి
జన్మదిన శుభాకాంక్షలు
HAPPY BIRTHDAY
నగరి నియోజకవర్గాన్ని
అభివృద్ధి చేసిన
కీ॥శే॥ గాలి ముద్దుక్రిష్ణమ నాయుడు గారి
తనయుడు నగరి నియోజకవర్గ ప్రజల సంక్షేమం మరియు
అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న మా యువనాయకులు
శ్రీ గాలి భానుప్రకాష్ గారికి
ఇవే మా హార్థిక
జన్మదిన శుభాకాంక్షలు
థాశన్ అమృతరాజ్‌తో కీళపట్టు మహిళలు
గౌ॥ శ్రీ గాలి భానుప్రకాష్ గారు
ఎమ్మెల్యే, నగరి నియోజకవర్గం
థాశన్ అమృతరాజ
నగరి మున్సిపాలిటీ

భూసేకరణ పరిహారంపై విచారణ


చిన్నఈటిపాకంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సత్యవేడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లడం, చిన్నఈటిపాకం గ్రామాల్లో ఏపీపీఐసీ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న భూసేకరణకు సంబంధించి పరిహారంపై సూళ్ళూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో గురువారం విచారణ చేపట్టారు. తహసీల్దార్ రాజశేఖర్ పర్యవేక్షణలో ఆయా గ్రామాల్లోని రైతుల నుంచి పట్టాదారు పుస్తకం, టైటిల్ డీడ్ తదితర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో భాగంగా కొల్లడంలో ముగ్గురు రైతులు, చిన్నఈటిపాకంలో 28 మంది రైతులు తమ హక్కు పత్రాలను అధికారులకు అందజేసి వివరాలను నమోదు చేసుకున్నారు. అవార్డు ఎంక్వైరీలో ఓజిలి తహసీల్దార్ పద్మావతి, బుచ్చినాయుడు కండ్రిగ డీటీ రవిచంద్ర, ఆర్డీవో కార్యాలయం ఏవో రవికుమార్, సత్యవేడు డీటీ త్యాగరాజు, ఆర్ఐ సురేష్, వీఆర్వో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ సీఎఫ్‌వో నాగరాజన్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

సత్యవేడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ సీఎఫ్‌వో (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్) నాగరాజన్‌కు ప్రతిష్టాత్మక 'బెస్ట్ సీఎఫ్‌వో ఇన్ స్మాల్ ఎంటర్ ప్రైజ్'అవార్డు వరించింది. ఈ నెల 18న ముంబైలోని జియో వరల్డ్ ఫైనాన్స్ స్ట్రాటజి ఎక్సలెన్స్ అవార్డుల ప్రధానోత్సవంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఉత్తమమ ఆర్థిక ప్రణాళిక, పనితీరుకు ఈ అవార్డు దక్కింది.


అవార్డు అందుకుంటున్న నాగరాజన్

మధ్యాహ్న భోజనం రుచిగా పెట్టాలి



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈవో

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచిగా చేసి పెట్టాలని ఎంఈవో-2 మునిసుబ్రమణ్యం సూచించారు. కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. వంట గదిలో సరుకులను పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. .

సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా దశరథాచారి

శ్రీకాళహస్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ పీలేరు సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా శ్రీకాళహస్తికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి నియమితులయ్యారు. గురువారం ఆయన పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగల ఎన్నికల గురించి చర్చించార

అన్నదాత సుఖీభవ లబ్ధికి ఈకేవైసీ తప్పనిసరి


రైతుల నుంచి వేలిముద్రలు తీసుకుంటున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ కింద లబ్ధి పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షణ్ముగం రైతులకు సూచించారు. మండల వ్యవసాయ కార్యాలయంలో గురువారం రైతులతో ఈకేవైసీ ప్రక్రియ చేయించారు. ఆయన మాట్లాడుతూ కొంతమంది ఈకేవైసీ చేసుకున్నారని మిగిలిన వారు కూడా చేసుకోవాలని కోరారు.

గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

రేణిగుంట, జూన్ 19, (ఆంధ్రజ్యోతి) : నడి వీధి గంగమ్మను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దంపతులు గురువారం దర్శించుకున్నారు. కరకంబాడి నడివీధి గంగమ్మ జాతర సందర్భంగా కట్టపుట్టాలమ్మ ఆలయానికి చేరుకున్న వీరికి టిడిపి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం పుట్టాలమ్మను దర్శించుకుని, కరకంబాడిలోని నడి వీధి గంగమ్మకు మొక్కలు చెల్లించారు. మునిచంద్రారెడ్డి, మెహబూబ్ భాష, బుజ్జి నాయుడు, పాడి రాజేంద్ర పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలి

పిచ్చాటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తచూరు-చిత్తూరు-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రోడ్డుపై ఎస్ఎన్‌బీ పేట గ్రామ పంచాయతీ బంగారు నాయుడు కండ్రిగకు దక్షిణంగా ఉన్న సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. దీనివల్ల పరిసర 10 గ్రామాలకు ఉపయుక్తంగా ఉంటుందని గ్రామ సర్పంచ్ మనోహర్ పేర్కొన్నారు. గతంలో ఈ సమస్యపై తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశామన్నారు. ఈ పరిసరాల్లోని ప్రభుత్వ భూమిలో 700 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరామన్నారు. ఈనేపథ్యంలో సర్వీసు రోడ్డు అవసరముందన్నారు.

అక్షయ క్షేత్రంలో అన్నదానం

రేణిగుంట, జూన్ 19, (ఆంధ్రజ్యోతి) : అక్షయ క్షేత్రంలో బిజేపీ నాయకులు గురువారం అన్నదానం నిర్వహించారు. బిజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ జన్మదినం సందర్భంగా పాత విమానాశ్రయం రోడ్డులోని అభయ క్షేత్రంలో మానసిక వికలాంగులకు కోలా ఆనంద్ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజా రాయల్, వేణు, ముదిరాజు, బాలాజీ, మురుగా తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

శ్రీకాళహస్తి: కోలా ఆనంద్ దంపతులు తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంలో చొక్కాని రామ్మూర్తి,బిందురాయల్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మండలం వెలంపాడుల పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరేష్, కృష్ణయ్యయాదవ్ పాల్గొన్నారు.

గృహోపకరణాల వితరణ

శ్రీకాళహస్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మైనార్టీ నూతన వధూవరులను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆశీర్వదించి బీరువా, మంచం, పరుపును వితరణ చేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

ధర లేక మామిడి రైతుల దిగాలు


కోయకుండా వదిలేసిన మామిడి కాయలు

పుత్తూరు టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ మండీ వ్యాపారులు, గుజ్జు పరిశ్రమలు సహకరించకపోవడంతో మామిడి రైతులు కాయలు కోయకుండా వదిలేస్తున్నారు. గుజ్జు పరిశ్రమ టోకన్‌ల జారీలో తీవ్ర జాప్యం చేస్తోందని రైతులు వాపోతున్నారు. కోత కూలీ కూడా రాకపోవడంతో రైతన్నలు మామిడి కాయలను చెట్లలోనే వదిలేస్తున్నారు. ఈ ఏడాది ఎక్కువగా కాపు కాయడం, తమిళనాడు నుంచి తక్కువ ధరలకే లభ్యమవ్వడంతో స్థానిక రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. గుజ్జు పరిశ్రమల యజమానుల నుంచి అనుమతికే 4 రోజులు పడుతుండటంతో రైతులు ఆవేదన చెందున్నారు.

యోగాతో శారీరక రుగ్మతలు దూరం


పిరమిడ్ కేంద్రంలో యోగాభ్యాసం

పుత్తూరు,జూన్19(ఆంధ్రజ్యోతి): యోగాతో శారీరక రుగ్మతలు తొలగడంతో పాటు క్రమశిక్షణ,నాయకత్వ లక్షణాలు అలవడుతాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలో గురువారం యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరయ్య, వీరయ్య, నాగేశ్వరరావులు పాల్గొన్నారు. త్రినేత్ర పిరమిడ్ కేంద్రంలో విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం యోగా తరగతులు నిర్వహిస్తున్నారు..

రేపటి యోగాంధ్రకు ఏర్పాట్లు పూర్తి

పుత్తూరు అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని వేడుకగా చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ తెలిపారు. శుక్రవారం రిహార్సల్స్‌కు తుడా పార్కు, వివిధ సచివాలయాల్లో వేదికలను సిద్ధం చేశామన్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు జరుగుతుందన్నారు. శనివారం యోగాంధ్ర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

పుత్తూరు టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి):పలు పంచాయితీల కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. తడుకు పంచాయితీ కార్యదర్శి నరేష్‌కుమార్ కేబీఆర్ పురానికి, అక్కడ పనిచేస్తున్న అనిల్ తడుకు పంచాయితీకి బదిలీ అయ్యారు. శిరుగురాజపాలెం కార్యదర్శి హరిత సత్యవేడుకు, రామకృష్ణపురానికి చెందిన కిషోర్ వడమాలపేటకు, అక్కడ నుంచి అనిల్ కుమార్ బదిలీ అయ్యారు. నాగేంద్ర, తొరూరు రాములు కేవీబీపురానికి బదిలీ అయ్యారు. వేపగుంట భారతి రామసముద్రానికి బదిలీ అయ్యారు.

ఉత్తరపు కండ్రిగ సెక్రటరీ నారాయణవనం మండలానికి బదిలీ అయ్యారు. కృష్ణసముద్రం పరమేశ్వరి వడమాలపేటకు బదిలీ అయ్యారు. నేసనూరు సుజాత సత్యవేడుకు, పీఆర్ మంగళం దయానంద్ వరదయ్యపాలెంకు బదిలీ అయినట్లు ఆయన వివరించారు.

మురుగునీటి కాలువల శుభ్రతకు చర్యలు

వడమాలపేట,జూన్ 19(ఆంధ్రజ్యోతి):మేజర్ పంచాయతి వడమాలపేట దళితవాడలో మురుగునీటి కాలువలను అధికారులు శుభ్రం చేయించారు. కానరాని పారిశుధ్యం శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం వార్త వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు గురువారం పారిశుధ్య కార్మికులతో మురుగునీటి కాలువలను, పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ దళితవాడలో మురుగునీటి కాలువలను మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. పంచాయతి కార్యదర్శి హితేష్, అసిస్టెంట్ జయచంద్రలు పాల్గొన్నారు.